
# స్రవంతి

## - పి. తిరుపతిరావు



ప్రొద్దస్తమానం పనిచేసి అలసిపోయిన కూలీలా విశ్రమించడానికి ఒదిగిపోతున్నాడు సూర్యుడు టెర్రస్ మీద ఆరేసిన బట్టలను తీస్తూ సూర్యాస్తమయాన్ని తిలకిస్తున్న లలితకు స్రవంతి కాలేజి నుండి రాలేదనే విషయం మరొకసారి జ్ఞప్తికి వచ్చింది. గేటు దగ్గర అలికిడి కావడంతో క్రిందికి చూసింది. తన భర్త శేఖర్ ఆఫీసునుండి రావడాన్ని గమనించి బట్టలన్నీ నీట్‌గా సర్దుకుని క్రిందికి వెళ్ళి భర్తతో ఆదుర్దాగా అంది.

''ఏమండీ స్రవంతి కాలేజి నుండి ఇంకా రాలేదు. మూడున్నరకే కాలేజి వదులుతారు. రోజూ నాలుగింటికల్లా ఇంట్లో వుండేది.. అలాంటిది టైమ్ ఆరవుతున్నారాలేదు.''

''వస్తుందిలే, మీ ఆడవాళ్ళకు కంగారెక్కువ. ఏదో కారణం చేత ఆలస్యమయి వుండచ్చు. ఈ మాత్రానికే గాబరాపడితే ఎలా?'' తేలికగా అన్నాడు శేఖర్ షూ విప్పుకుంటూ.

''ఏమోనండీ తను కాలేజీలో జాయినయి నాల్రోజులే అయింది. మీరు గమనించారో లేదో రోజూ కాలేజి నుండి వస్తూనే అదోలా వుంటుందీ. భోజనమూ సరిగా చెయ్యదు. నీరసంగా వుంటుందీ. మీరు దాన్ని కాలేజీలో అడ్మిట్ చేసి వచ్చారే గానీ మీ ఆఫీసుపనుల్లో బిజీగా వుంటూ పట్టించుకోవడం లేదు..''

లలిత మాటలకు ఆలోచనలో పడ్డాడు శేఖర్. నిజమే! స్రవంతిని కాలేజీలో అడ్మిట్ చేసిన తరువాత తన బాగోగులు గురించి పెద్దగా పట్టించుకోలేదు. అసలు తనకెక్కడ వీలవుతుందీ, ఉదయం ఆరుగంటలకు డ్యూటీకెళ్తే తిరిగి ఇంటికొచ్చేటప్పటికి రాత్రి తొమ్మిదీ...తొమ్మిద్దిన్నరవుతుంది. ఈరోజు శనివారం కావడంతో కాస్త ఎర్లీగా వచ్చాడు. స్రవంతి గురించి ఆలోచిస్తూ బాత్‌రూమ్‌కేసి నడిచాడు.

శేఖర్ వాళ్ళ స్వంత ఊరు ఒంగోలు. వృత్తిరీత్యా వైజాగ్‌లో సెటిలయ్యారు. స్రవంతి శేఖర్ చెల్లెలు. తనంటే శేఖర్‌కి చాలా అభిమానం. చిన్నప్పటి నుండి అన్నయ్యగానే గాక ఓ మంచి ఫ్రెండ్‌లా అన్ని విధాలా సహకారాన్నందించేవాడు. స్రవంతి కూడా మంచి ఇంటలిజెంట్. ఇంటర్ వరకు ఒంగోల్లోనే చదివింది. ఇంటర్‌లో మంచి పర్సంటేజి రావడంతో ఎమ్‌సెట్ ప్రిపేరయి అందులో మంచి ర్యాంక్ సాధించి తన అన్నయ్య వైజాగ్‌లో వుండడం వలన ఇక్కడే కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో జాయినయ్యింది.

శేఖర్ స్నానాదులు ముగించి భార్య ఇచ్చిన టీ తాగుతూ హాల్లో కూర్చుని టి.వి.చూడసాగాడు. స్రవంతి ఇంకా రాకపోవడంతో కాలేజికి ఫోన్ చేసాడు. అక్కడి వాచ్‌మెన్ ఫోన్ రిసీవ్ చేసుకుని ఫస్టియర్ కంప్యూటర్ క్లాసులు టూథర్టీకే అయిపోయాయని తెలిపాడు. ఆ వార్తతో శేఖర్ కొంచెం కంగారు పడ్డాడు. ''ఫ్రెండ్స్‌తో కలిసి సరదాగా ఎక్కడికైనా వెళ్ళిందా'' యిలా తనలో తాను ఆలోచిస్తుండగా కాలింగ్ బెల్ మ్రోగింది.

లలిత వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా స్రవంతి. చాలా డల్‌గా వున్నట్టు గమనించాడు. పరిశీలనగా చూసాడు ఆమె ముఖంలోకి, కళ్ళు ఉబ్బి ఎర్రగా వున్నాయి. ఏడ్చిందనే సంకేతాన్ని తెలుపుతున్నాయి.

లలిత అడిగింది. ''ఏంటమ్మా ఏమైందీ అలా వున్నావు'' అనీ! అలా అడగడమే ఆలస్యం. చేతిలో వున్న కాలేజి బ్యాగును సోఫా మీద పడేసి దోసిళ్ళలో ముఖం పెట్టుకుని ఏడవసాగింది. లలితకీ, శేఖర్‌కీ పరిస్థితేమిటో అర్థం గాలేదు. కొన్ని క్షణాలు మౌనంగా గడిచాయి. లలిత టెన్షన్ ఆపుకోలేక మరలా అడిగింది.

''అన్నయ్యా, నేనిక కాలేజీకి వెళ్ళను, నాకీ చదువొద్దు.ఏమొద్దూ...కాలేజీలో అడుగుపెట్టినప్పటి నుండి తిరిగి వచ్చేవరకు అనుక్షణం నరకంగా వుంటుందీ, మా సీనియర్స్ ర్యాగింగ్ పేరుతో రకరకాలుగా హింసిస్తున్నారు. ఈ రోజు మాకు టూథర్టీకే క్లాసులయిపోయాయి. ఆచారీ అని మా సూపర్ సీనియర్, నాతో పాటు కొంతమందిని అప్పటి నుండి ఇప్పటివరకు ర్యాగింగ్ చేస్తున్నాడు..నాకు చాలా..''

ఇలా చెప్తుండగానే మధ్యలోనే పెద్దగా నవ్వాడు శేఖర్.

లలిత భర్తవంక కోపంగా చూసిందీ. ''ఏంటండీ, అదలా బాధపడుతుంటే మీకు జోక్‌గా వుందా?''

''లలితా, ఆడవాళ్ళు అంతరిక్షంలో సహితం అడుగుపెడుతున్న ఈరోజుల్లో కేవలం ర్యాగింగ్‌కు భయపడి కాలేజి మానేస్తానంటున్న నా చెల్లిని చూస్తే నవ్వొస్తుంది.''

ఆ మాటకి చప్పున తలెత్తి చూసింది స్రవంతి.

''చెల్లాయ్. కాలేజీల్లో ర్యాగింగ్ అనేది సర్వసాధారణం. ఏదో సరదాగా జూనియర్స్‌ని ఆట పట్టిస్తుంటారు సీనియర్స్. అదీ కొంతకాలమే. నేనూ చదువుకునే రోజుల్లో ర్యాగింగ్ బారిన పడ్డాను. ఆ నెక్స్ట్ ఇయర్ నేనూ చేసాను. ఇప్పుడు నీవిలా ఫీలవుతున్నావు కాని కొన్ని రోజులు పోయాకా జరిగింది తలుచుకుంటే నీక్కూడా గమ్మత్తుగా అనిపిస్తుంది.''

''లేదన్నయ్యా, ఆచారీ వాడి ఫ్రెండ్స్ నన్ను మరీ విసిగిస్తున్నారు. ఏదో ఒక వంకతో నన్ను తాకాలని ప్రయత్నం చేయడం..డబల్ మీనింగ్ డైలాగులతో నాపై జోకులేసుకోవడం..యిలా ఒకటేమిటి, రకరకాలుగా నన్ను వేధిస్తున్నారు. అది సరదానా?'' దుఃఖం నిండిన స్వరంతో సూటిగా ప్రశ్నించింది.

''నేనది తట్టుకోలేను. హాయిగా మనూరు వెళ్ళి ఏ ఆర్ట్స్‌లోనో జాయినవుతాను..'' స్రవంతి చెప్తుంటే లలిత ఆవేశం ఆపుకోలేక వాళ్ళని చెడామడా తిట్టేస్తుంది.

శేఖరేమీ మాట్లాడలేదు. స్రవంతి మనసెంతో గాయపడిందని అర్థమయిందతనికి. ''సర్లే ముందు నీవెళ్ళి ఫ్రెషవు'' అంటూ పంపించేశాడు. లలిత కూడా వెళ్ళింది.

ర్యాగింగ్ అనేది సీనియర్స్‌కీ జూనియర్స్‌కీ మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పాల్సిన ప్రక్రియ. కొత్తగా జాయినయిన జూనియర్స్‌నీ స్వాగతిస్తూ వారిలో వున్న భయాన్ని పోగొడుతూ కాలేజీ వాతావరణాన్ని పరిచయం చేస్తూ, వారితో ఫ్రెండ్లీగా కలిసిపోవాలి సీనియర్స్. కానీ ఆచారి లాంటి స్టూడెంట్స్ మూలంగా ర్యాగింగ్ అర్థమే మారి రాక్షస చర్యలా రూపాంతరం చెందింది. ఎన్నో కొత్త ఆశలతో భవిష్యత్తును ఊహించుకుంటూ కాలేజీలో అడుగుపెట్టిన విద్యార్థులకది శాపంగా మారుతుంది. మరీ సున్నిత మనస్కులయితే తమ జీవితాన్నే అంధకారం చేసుకుంటున్నారు.

శేఖర్ మనసులో మెదుల్తున్న ఆలోచన ఒకటే! ముందు స్రవంతిలో వున్న భయాన్ని పోగొట్టి మానసికంగా ఆమెను చైతన్యపరచాలీ.. అనీ.

• • •

ఆ రాత్రి భోజనాల దగ్గర కూడా స్రవంతి అన్యమనస్కంగా వుండడం..భోజనం సరిగా చెయ్యకపోవడం గమనించాడు శేఖర్. డిన్నర్ పూర్తయిన తరువాత హాల్లో కూర్చుని టివి ఆన్ చేసింది స్రవంతి. శేఖర్ కూడా ప్రక్క చెయిర్‌లో కూర్చున్నాడు. స్రవంతి కళ్ళు టివి స్క్రీన్ మీద వున్నా ఆమె మనసు మాత్రం ఏదో ఆలోచిస్తుందని శేఖర్ గ్రహించాడు. కల్పించుకుని ఇలా అన్నాడు.

''నీవు మరీ చిన్న విషయానికి గూడా అప్‌సెట్ అయి, డిప్రెషన్‌కు లోనవడం నాకేం నచ్చలేదు. అసలు ర్యాగింగ్‌కు భయపడతానని నేనసలు వూహించలేదు. కాలేజీకి వెళ్ళడం ప్రారంభించిన రోజు నుండి నీవు డల్‌గా వుంటున్నావని మీ వదినమ్మ చెప్తుంటే నేను మరేదో అనుకున్నాను. కానీ..'' అతని మాటలకు అడ్డుపడుతూ అంది.


''నా సమస్య మీకు చిన్న విషయంగా అన్పించవచ్చు. ర్యాగింగ్ చేస్తారని తెలుసు. కానీ ఇంతలా వుంటుందని నేననుకోలేదు. కనీసం సమయానికి క్లాసులకైనా వెళ్ళనివ్వడం లేదన్నయ్యా, కాలేజి క్యాంపస్‌లోనే కాదు, బస్సులో కూడా ఇదే తంతు..నాకు తల తీసేసినట్టుగా వుంటుంది. మీకేం తెలుసు నా బాధ..మా క్లాస్‌మేట్స్ కొంతమంది దీనిని తట్టుకోలేక క్లాసులకు రావడం కూడా మానేసారు'' ఆమె కళ్ళు వర్షించడానికి సిద్ధంగా వున్న మేఘంలా వున్నాయి.

''అసలు నాకో విషయం చెప్పు. వాళ్ళు నిన్ను మరీ విసిగిస్తున్నారని చెప్తున్నావు. నీ దగ్గర వాళ్ళలా బిహేవ్ చేస్తున్నప్పుడు నీవెందుకు కామ్‌గా వుంటున్నావు? వారిని ఎదిరించే సాహసం నీవెందుకు చేయలేకపోతున్నావు?''

''అది ఆడపిల్లండీ..పైగా కాలేజి కొత్త'' వారి దగ్గరకు వచ్చి కూర్చుంటూ అంది లలిత.

''షటప్'' కొంచెం కోపంగా అరిచాడు శేఖర్. ''ఈరోజుల్లో ఆడామగా ఏమిటి..అసలు దాదాపు మీ ఆడవాళ్ళకున్న పెద్ద జబ్బేమిటో తెలుసా మిమ్మల్ని మీరు తక్కువగా అంచనా వేసుకోవడం..మీ మీద మీకే నమ్మకం లేకపోవడం..'నేనాడదాన్ని కదా. నేనేం చేయగలను' ఇలాంటి ఆలోచనలతో ముందుగానే మిమ్మల్ని మీరు డిజప్పాయింట్ చేసుకుంటారు. అది మీ బలహీనత. ఆ బలహీనతనే ఎదుటి వాడు అడ్వాంటేజ్‌గా తీసుకుంటాడు..''

చూడమ్మా స్రవంతీ. ఈరోజుల్లో సాఫ్ట్‌గా వుంటే లాభం లేదు. షార్ప్‌గా వుండాలి. ఎదుటి వ్యక్తి మనలో మాట్లాడుతున్నప్పుడు అతడి అంతరంగాన్ని ముందే చదవగలిగేంత నేర్పు మనలో వుండాలి. నేను ఎమ్‌టెక్ చేసే రోజుల్లో నళిని అని మా జూనియర్ వుండేది. చాలా అందంగా వుంటుంది. ఆమెతో మాట్లాడాలని ప్రతి ఒక్కడూ ప్రయత్నించేవాడు. ఆమె చేరిన కొత్తలో యిలాగే సీనియర్స్ ర్యాగింగ్ చేసేవారు. కానీ తను ఎవర్నీ కేర్ చేసేది కాదు. ఓసారి ఆచారీలాంటి సీనియరొకడు శృతిమించి ప్రవర్తించేసరికి చెంపపగలగొట్టింది అందరి ముందు... అంతే! అప్పట్నుండి ఆ అమ్మాయితో మాట్లాడటానికి జంకేవాళ్ళు. ఇదంతా ఎందుకు చెప్తున్నానో తెలుసా! వాళ్ళు అసభ్యంగా కామెంట్ చేస్తున్నారని నీలో నీవు కుమిలిపోతున్నావే గానీ వాళ్ళని ఏమీ అనలేకపోతున్నావు..ఇక్కడ నా ఉద్దేశ్యం, అందర్నీ ఎదిరించమని కాదు. సీనియర్స్‌ని గౌరవించవద్దనీ కాదు. కానీ మనకీ ఒక వ్యక్తిత్వమనేది వుంది. మన ఆత్మాభిమానం దెబ్బతినేలా అవతలి వ్యక్తి ప్రవర్తిస్తుంటే మౌనంగా సహించాల్సిన అవసరం ఏమాత్రం లేదు. మన వ్యక్తిత్వాన్ని చంపుకుంటూ వాళ్ళు చేష్ట



## సద్దుమణిగిన సౌందర్య గొడవ



సినిమా తారలంటే వాళ్లంత అదృష్ట వంతులు మరెవరూ వుండరని మనం అనుకుంటూ వుంటాం. నిజానికి టాప్ పొజిషన్‌లో వున్న కుమారి సౌందర్యకు ఇంట్లో పొజిషన్ చాలా డెలికేట్‌గా వుంటుంది. తండ్రి చనిపోయాక తన డేట్స్ అన్నీ చూస్తున్న అన్నయ్య అమర్ సౌందర్యని చాలా ఇబ్బందులపాలు చేశాడు. వారిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే బగ్గుమనే గొడవలు ఇటీవలే వాళ్ల అమ్మ సెటిల్ చేసిందిట. మళ్లీ ఇప్పుడు వాళ్ల అన్నయ్యే సౌందర్య డేట్స్ చూస్తున్నాడట. ఏమైనా అనుకున్నంత పూలబాట కాదు సినిమా లోకం.

## కరుణామయుడి పుణ్యక్షేత్రం

కరుణామయుడిగా విజయ్‌చందర్‌కి మంచి పాపులారిటీ వుంది ప్రజల్లో. దాన్ని దృష్టిలో పెట్టుకునే ఇటీవల హైద్రాబాద్‌కి కొన్ని కిలోమీటర్ల దూరంలో వున్న మెదక్ జిల్లాలోని కరకపట్నంలో 'కరుణామయుడి పుణ్యక్షేత్రాన్ని' స్థాపించాడు. ఫిబ్రవరి 24న ఎందరో సినీ ప్రముఖుల సమక్షంలో వైభవోపేతంగా జరిగిన ఈ పండుగ ఎందరో పేదప్రజలను ఆదుకోనున్నది. ఏది ఏమైనా సినిమాల్లో హీరోగా నటించడం కాదు, రియల్ లైఫ్‌లో ఇలా హీరోచితంగాచేసి, అందరిచేత శభాష్ అనిపించుకోవడమే నిజమైన హీరోయిజం.

**- విరాజి**

లకు తలొంచాల్సిన పనే లేదు.'' చెప్పడం ఆపి స్రవంతి వంక చూసాడు. తను శ్రద్ధగా ఆలకించడం గమనించాడు. ఆమెముఖంలో ఇందాకటి దిగులు కన్పించడం లేదు.

''అది కాదన్నయ్యా..కొంతమంది సీనియర్స్ కూడా వాడో శాడిస్ట్‌వెధవ..వాడు చెప్పింది చెయ్యండే..త్వరగా వదిలేస్తాడు. లేదంటే మరికాస్త ఎక్కువ చేస్తాడు. వాడితో గొడవెందుకు అంటూ వంత పాడుతున్నారు. మేమేం చేయగలం'' చెప్పుంది స్రవంతి.

''అదిగో అదే మీ బలహీనత. ర్యాగింగ్ చేయడం తప్పని నేననను. కానీ దేనికైనా ఓ లిమిట్ వుంటుంది. చెల్లీ, మన ఉనికిని మనం కాపాడుకోవడానికి కొన్ని కొన్ని పరిస్థితుల్లో తెగింపు తప్పనిసరి. అసలు వాళ్ళు నీ దగ్గర కొచ్చి నానా ప్రశ్నలతో విసిగిస్తున్నప్పుడు ఏమాత్రం కేర్ చేయకుండా ఫేస్ టు ఫేస్ సమాధానిమచ్చుంటే ఇంతలా నీ జోలికొచ్చేవాళ్ళు కాదు.

వాళ్ళూ ఒకప్పుడు జూనియర్సే. అసలు వాళ్ళకు భయపడి కాలేజీకి వెళ్ళకపోవడం...చదువు మానేయాలనుకోవడం నా దృష్టిలో అవివేకం'' స్రవంతి వైపు చూశాడు. శేఖర్ చెప్తున్న మాటలు స్రవంతి హృదయంలో ఒకలాంటి ఉద్వేగాన్ని సృష్టిస్తున్నాయి. లలిత కూడా భర్త మాటలను ఆసక్తిగా వింటోంది.

''చెల్లాయ్. స్రవంతీ అనే నీ పేరుకు అర్థమేమిటో తెలుసా. ప్రవాహం అనీ! ఆ ప్రవాహాన్ని చూడు..అది ప్రవహించే మార్గంలో రాళ్ళు, ముళ్ళూ, గుట్టలూయిలా ఎన్నో ఎత్తుపల్లాలు దానికెదురవుతూ వుంటాయి. కాని అది వేటినీ లెక్క చేయదు. వాటిని కూడా తనలో కలిపేసుకుని చేరాల్సిన గమ్యం కేసి ఉరుకుల పరుగులతో సాగి పోతుంటుంది. ఆ ప్రవాహం నిర్జీవమైనదే కావచ్చు. దానికి మనలా ఆశలూ, ఆశయాలు ఏవీ లేకపోవచ్చు. కానీ అది మనకో స్ఫూర్తి. నీవు అంతే. ఆ ప్రవాహంలా సాగిపోవాలి. జీవితంలో ఎదురయ్యే ఆటంకాలను ఆత్మవిశ్వాసంతో ఫేస్ చేస్తూ సాధించాలనుకుంటున్న గోల్ వైపు సాగిపోవాలి. అంతేకాని ఇలాంటి చిన్న చిన్న సమస్యలకే భయపడి వెనకడుగు వేస్తే సాధించేది శూన్యం. అసలు ఒక్క విషయమాలోచించు. నీవు ఈ స్థితికి రావడానికి ఎంత కష్టపడి చదివావు. ఎన్ని నిద్రలేని రాత్రుళ్ళను గడిపావు. అలాంటిది, ఎవరో పనీ పాటా లేని ఇడియట్స్‌కి భయపడి నీ కెరీర్‌ని పాడు చేసుకుంటావా? అసలు నీ భయానికి అర్థముందా'' సూటిగా ప్రశ్నించాడు శేఖర్.

స్రవంతి బదులు చెప్పలేదు. ఆలోచిస్తూ మౌనంగా వుండిపోయింది. శేఖర్ చెప్పుకుపోతున్నాడు.

''నిరాశ, భయం అనేవి మనలో వుంటే గోరంత విషయాన్ని కూడా కొండంత చేసి చూపుతాయి. అందుకే అవి మన దరిదాపుల్లోకి రాకూడదు. రేపు నీవు ధైర్యంగా కాలేజీకి వెళ్ళు. ఎవ్వరైనా సరే మీ సీనియర్స్ హద్దులు దాటి నీ దగ్గర అతిగా ప్రవర్తిస్తున్నారని అనిపిస్తే నిస్సహాయురాలిగా మౌనంగా వుండకు. అలామౌనంగా వుంటే ఇంకా ఎక్కువ చేస్తారు. వారి అహం మీద దెబ్బకొట్టు. వాళ్ళేమయినా చేస్తారేమోనని భయపడకు. ఈరోజుల్లో ర్యాగింగ్ చేయడం కూడా నేరం. నీకు ఈ అన్నయ్య ఉన్నాడు. పిచ్చి పిచ్చి వేషాలేస్తే వాళ్ళ సంగతి నేను చూస్కుంటా. ఒక్కటి గుర్తుపెట్టుకో. మనోధైర్యానికి మించిన మందు మరొకటి లేదు. వెళ్ళు, వెళ్ళి ప్రశాంతంగా నిద్రపో'' అంటూ అక్కడి నుంచి లేచాడు శేఖర్.

అతడికి తెలుసు తన మాటల ద్వారా అందించిన ప్రోత్సాహం ఆమెను ప్రభావితం చేస్తుందనీ..చిన్నప్పటి నుండి ఆమె మనసు నెరిగినవాడు కదా మరి!

శేఖర్ చెప్పిన మాటలు ఆమెలో టానిక్కులా పనిచేయసాగాయి. ''అవును. తనెందుకు భయపడాలి. కొంతకాలం తాత్కాలికంగా వుండే ఈ ర్యాగింగ్‌కే భయపడితే..జీవితంలో మరెన్నో సమస్యలను ఎదుర్కోవలసి రావచ్చు. మరి అప్పుడు? ర్యాగింగ్‌కు భయపడి ఎంతోమంది తమ కెరీర్‌ని అంధకారం చేసుకుంటున్నారు. నేను వారిలా..ఛ! అలా ఆలోచిస్తుంది..ఇప్పుడు తన భయమంతా తనకే అర్థం లేనిదిగా కనిపిస్తుంది. అన్నయ్య చెప్పినవన్నీ గుర్తొస్తుంటే ఏదో మోరల్ సపోర్ట్ దొరికిన దానిలా ఆమె హృదయం తెలియని ఉద్వేగంతో నిండిపోయింది. ఇప్పుడామెలో భయం తాలూకు ఛాయలన్నీ సూర్యరశ్మి తాకిన పొగమంచులా ఆవిరయి పోసాగాయి.


ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపోయింది.

• • •

ఆ తర్వాత ఎప్పటిలా కాలేజీకి వెళ్ళింది స్రవంతి. ఆ రోజు అన్ని క్లాసులు జరిగాయి. క్లాసు మధ్యలో సీనియర్స్ తమ క్లాస్‌రూమ్ దగ్గర పచార్లు చేయడం, మాస్టర్స్ వుండడం వలన వెళ్ళిపోవడం..ఇవన్నీ గమనిస్తూనే వుంది. ''పిరియడ్స్ ఖాళీగా వుంటే వచ్చి బుర్రలు తినేసేవారే'' అనుకుంది స్రవంతి.

సాయంత్రం క్లాసులన్నీ అయిపోగానే తన ఫ్రెండ్స్‌తో కలిసి వస్తుంటే క్యాంపస్‌లో కనిపించారు ఆచారీ..వాడి సహచరులు. ''ఏమే స్రవంతి ఆ తొట్టి గ్యాంగ్ కంటపడ్డామే పట్టుకుంటే వదలరు'' అంది స్రవంతి ఫ్రెండ్ శ్రీజ. స్రవంతికి కూడా వారు దగ్గర కొచ్చే కొద్ది భయంగానే వుంది. వాళ్ళు దగ్గరకొచ్చి మాటలు కలిపారు.

''హలో గాళ్స్, ఏంటీ ఈరోజు క్లాసులన్నీ జరిగిన



ట్టున్నాయి''

''అవునండీ!'' కొంచెం బెరుగ్గా చెప్పింది శ్రీజ.

''హాయ్ బ్యూటీ..నీవేంటి డల్‌గా వున్నావు..దిసీజ్ ఫర్ యూ'' అంటూ స్రవంతి ప్రక్కకొచ్చి ఫైవ్‌స్టార్ చాక్లెట్ ఇవ్వబోయాడు. స్రవంతి అసహనంగా ఫీల వుతూ ''వద్దండీ'' అంది వినమ్రంగా.

''ఏంటీ, ఏదో పెద్ద లవ్ లెటర్ తీసుకుంటున్నట్టు ఫీలవుతున్నావు. ఇది చాక్లెట్ మేడమ్. తీసుకో'' అన్నాడు వెటకారంగా. ఆ మాటకి వాడి ఫ్రెండ్స్ నవ్వ సాగారు. స్రవంతికి ఒళ్ళుమండిపోతుంది.

''ఎందుకండీ, అలా నవ్వుతారు పళ్ళు బయటపడ తాయి'' అంది కొంచెం బెరుగ్గా, ఏమనాలో అర్థం గాక.

''గొప్ప జోక్‌రా బాబూ, నవ్వితే పళ్ళుగాక ప్రేగులు బయటపడతాయా? ఏమ్మా మీరెప్పుడైనా నవ్వినప్పుడు ప్రేగులు బయటపడడం చూశారా?'' అంటూ ప్రశ్నించాడు అమాయకంగా ముఖం పెట్టి..

స్రవంతి ఇక ఊరుకోలేదు. వెంటనే అంది. ''ఒక ఆకారమంటూ లేని మీలాంటి అమీబాఫేసులు నవ్వుతుంటే చూసేవారికి అసహ్యంతో ప్రేగులే బయటపడ తాయి మరి'' అనీ!

స్రవంతి మాటలకి నిర్ఘాంతపోయారు వాళ్ళు. ఆచారికి ఎక్కడలేని కోపం వచ్చింది.

''ఏంటీ మావి అమీబా ఫేసులా? ఇందాకట్నుండి చూస్తున్నాను. సీనియర్స్ అనే రెస్పెక్ట్ లేకుండా నోటి కొచ్చినట్టు వాగుతున్నావు. ఎంత పొగరు..'' అతడ్ని పూర్తిగా అననీయకుండా అడ్డుపడుతూ...

''మీరు మా దగ్గర సభ్యతగా ప్రవర్తిస్తుంటే మేము సీనియర్స్‌గా మిమ్మల్ని గౌరవిస్తాం. సీనియర్స్ అంటే జూనియర్స్‌కి ఆదర్శంగా వుండాలి. అంతేగాని క్లాసు లెగ్గొట్టి కాలేజీ క్యాంపస్‌లో కాలక్షేపం చేస్తూ, కనిపించిన ప్రతి జూనియర్‌ని ర్యాగింగ్ పేరుతో హింసిస్తూ ఆనందించే మీకు రెస్పెక్ట్ ఎలా ఇవ్వగలం?'' ఒకింత ధైర్యం చేస్తూ అంది.

ఆ మాటలు విన్న వారి ముఖాలు మాడిపోయిన ఆమ్లెట్‌లా అయిపోయాయి. స్రవంతి అలా మాట్లాడడం ఆమె ఫ్రెండ్స్‌కి కూడా ఆశ్చర్యంగా వుంది.

''నీవు చాలా ఎక్కువగా మాట్లాడుతున్నావు. మా టాలెంటేమిటో నీకు పూర్తిగా తెలియదు'' ఎర్రబడ్డ ముఖంతో రోషంగా అన్నాడు వారిలో ఒకడు.

''నేను అనేది కూడా అదే. మీకున్న ఆ టాలెంట్‌ని సబ్జెక్ట్స్‌పై చూపించి వుంటే ఈపాటికి మీ బ్యాక్‌లాగ్స్ అయినా పూర్తయి వుండేవి'' ఏమాత్రం తగ్గకుండా ధీటుగా అంది స్రవంతి.

చాచి చెంపమీద కొట్టినట్టు ఫీలయ్యారు వాళ్లు. ఆచారికి నోటమాట రాలేదు. నిన్నటిదాకా ఎంత అల్లరి పెట్టినా పెదవి విప్పని ఈ అమ్మాయేనా ఇలా మాట్లాడుతుంది. ఇంత ధైర్యం ఎలావచ్చిందీ? ఆలోచనలో పడిపోయాడు. అంతలో స్కూటర్ మీద వెళ్తున్న వాళ్ళ బ్రాంచ్ హెడ్ వీరిని చూసి స్కూటర్ స్లో చేస్తూ అన్నాడు.

''ఏం చేస్తున్నారు మీరిక్కడ. ఏంటాచారీ ర్యాగింగ్ చేస్తున్నావా జూనియర్స్‌నీ!'' హెడ్‌గారు సడెన్‌గా వారిదగ్గరకొచ్చి ప్రశ్నించడంతో కొంచెం కంగారు పడ్డారు ''అబ్బే..లేద్సార్..'' అంటూ ఏదో చెప్పబోయారు.

''క్లాసులయిపోయాయి గదా.. ఇక్కడేం పని.. వెళ్ళండంటూ'' హెచ్చరించాడు.

సమయానికొచ్చిన హెడ్‌గారికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ అక్కడ్నుంచి బయలుదేరారు స్రవంతి వాళ్ళు. వాళ్ళలా వెళుతుంటే ఏమీ చేయలేని నిస్సహాయతతో ప్రతిమల్లా చూస్తుండిపోయారు ఆచారీ గ్యాంగ్. వాళ్ళను దాటి కొంత దూరం వచ్చాక స్రవంతితో అంది శ్రీజ ''ఏంటే. ఈరోజు యిలా వాయించేశావు వాళ్ళనీ. నీవు అలా అంటుంటే మాకెంత భయం వేసిందో తెలుసా?''

''మనం అలా భయపడబట్టే అలుసుగా తీసుకుని మన దగ్గర పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నారు. ఓప్రక్క నాకూ భయంగానే వుందే, కాని మొండిగా ధైర్యం చేసానంతే!''

''సమయానికి హెడ్‌గారు రాబట్టి సరిపోయింది. లేకుంటే.. మన పనీ'' బెరుగ్గా అంది గీత.

''వాళ్ళ మొహం..ఏం చేస్తారేమిటి, ఏమైనా చేస్తే కాలేజి నుండి సస్పెండ్ అవుతారు. అదీ చాలదనుకుంటే జైల్లో ఊచలు లెక్కపెట్టుకుంటూ కాలక్షేపం చేస్తారు'' నవ్వుతూ స్థిరత్వం నిండిన కంఠంతో అంది.

''అసలింత ధైర్యం నీకెలా వచ్చిందే తల్లీ'' అని శ్రీజ అడుగుతుంటే.. స్రవంతికి వాళ్ళన్నయ్య గుర్తొచ్చాడు.


● ● ●

ఆ రాత్రి శేఖర్‌తో కాలేజిలో జరిగిన విషయమంతా చెప్పింది. అది విని శేఖర్ ఆశ్చర్యంగా ''నిజమా?'' అన్నాడు. ''నిజం అన్నయ్యా, కానీ ఇప్పుడు తలుచుకుంటే కొంచెం భయంగా వుంది, రేపు కాలేజీలో ఎటువంటి పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుందో అని!''

''చెల్లాయ్! అవే అనవసరపు భయాలంటే. ఈరోజు నీవలా మాట్లాడితే ఏం చేసారు వాళ్ళు. అంతేనమ్మా! ఏదైనా మనం అణిగి వున్నంతవరకే. డోంట్ వర్రీ'' స్రవంతి భుజంమీద తడుతూ అన్నాడు శేఖర్. ఆ మాటలకి రిలాక్స్‌డ్‌గా ఫీలయింది స్రవంతి. ఆమెలో ఇప్పుడెటువంటి భయమూ లేదు.

★

## ఆపరేషన్



పేషెంటు:- ''డాక్టర్! మీరు చేసింది మైనర్ ఆపరేషన్ అని ఎలా నమ్మమంటారు?''
డాక్టర్:- ''నీ పొట్టని పట్టుకొని చూడు. కుట్లు వేయకుండా గమ్‌తో అంటించాను.''

- జి. శారద

## ఎవరు?

''రక్తం చూస్తే తనకి కళ్లు తిరుగుతాయని అతను చెప్పగానే నువ్ కళ్ళు తిరిగి పడిపోయావా? ఇంతకీ ఎవరతను?''
''నాకు ఆపరేషన్ చెయ్యబోయిన డాక్టరు.''

## శౌర్యం

''ఒంటిచేత్తో పులిని చంపిన ధీశాలి మీరేనా? మీ శౌర్యానికి మెచ్చి మిమ్మల్ని సన్మానించడానికొచ్చాం సార్'' అన్నాడు గుంపులోని ఒకడు.
''ష్.. నెమ్మదిగా మాట్లాడండి. మా ఆవిడ ఇంట్లోనే ఉంది'' భయంగా అన్నాడు ధీశాలి.

## అందుకు

హాస్పిటల్‌కెళ్ళి ఆపరేషన్ చెయ్యించుకోకుండానే తిరిగొచ్చేశావా? అదేం?! నటి నర్మదని ఆశ్చర్యంగా అడిగింది అముద.
''ఆ డాక్టర్ దుర్మార్గుడు. వయసు చెప్పందే ఆపరేషన్ చెయ్యడం కుదరదన్నాడు మరి'' బాధతో మూలుగుతూ కోపంగా అంది నర్మద.

- భానుకిరణ్ (సీతాఫల్‌మండి)

